క్లుప్తంగా

పైపులైన్‌కు మరమ్మతు



రేగొండ: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో కొనాయిపేటకు వెళ్లే రహదారిలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. ఈ మేరకు మిషన్ భగీరథ నీరు వృథా అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి సిబ్బందితో పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టారు. 'సాక్షి'కి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

ఎస్సైని కలిసిన నాయకులు



రేగొండ: రేగొండ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కోలేపాక భిక్షపతి ఆధ్వర్యంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏనుగు లింగారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు గుంటోజు కిషన్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మైస విరాజ్, యూత్ నాయకులు చింటు, నరేష్, మహేందర్‌రెడ్డి, రాజయ్య, సుమన్, నాగేంద్ర, కోటి పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల ప్రకటన



టేకుమట్ల: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల ప్రకటనను శనివారం మండంలోని రామకిష్టాపూర్(టీ) ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓనపాకల రవీందర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఓటర్ లిస్టును విడుదల చేసి వాటిపై అభ్యంతరాలను ఈ నెల 22, 23లో స్వీకరిస్తామని తెలిపారు. అనంతరం ఈ నెల 24న తుది జాబితాను విడుదల చేసి 29న ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

రక్తదానం మహాదానం



ఏటూరునాగారం: అన్ని దానాల్లో కన్న రక్తదానం గొప్పదని కన్నాయిగూడెం ఎస్సై సురేష్ తెలిపారు. మండలంలోని షాపెల్లి గ్రామానికి చెందిన లలిత అనే గొత్తికోయ కుటుంబానికి చెందిన గర్భిణీకి అరుదుగా దొరికే ఏబీ పాజిటివ్ రక్తం అవసరం ఉందని ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ గ్రూప్‌లో చూసి ఎస్సై వెంటనే స్పందించి ఏటూరునాగారం చేరుకొని రక్తదానం చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ నిర్వాహకులు రక్తదానాలు చేస్తూ ఎందరో ప్రాణాలను నిలుపుతున్నారని కొనియాడారు. ఈ మేరకు రక్తదానం చేసిన ఎస్సైను బ్లడ్ డోనర్స్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ వహీద్, పెండ్యాల ప్రభాకర్, దామెర ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలి

ములుగు రూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని బీజేపీ సీనియర్ నాయకురాలు గుగులోత్ స్వరూప అన్నారు. శనివారం జిల్లా నూతన అధ్యక్షుడు సిరికొండ బలరాంను ఆమె శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరం భాగస్వామ్యం కావాలని అన్నారు. కలిసిన వారిలో నాయకులు రవీంద్రాచారి, చల్లూరి మహేందర్, కృష్ణాకర్, కొత్త సురేందర్, జనార్దన్, హరీష్, మహేందర్ ఉన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

ఎస్ఎస్‌తాడ్వాయి: ఈనెల 22న బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో మండలంలోని మేడారంలో బీజేపీ నాయకులు శనివారం ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలను పంపిణీ చేశారు. రెడ్డిగూడెంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి సర్పంచ్ చిడ్డం బాబురావుతో కలిసి నాయకులు అక్షింతలను తీసుకుని నేరుగా సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్దకు వెళ్లారు. పూజలు నిర్వహించి అమ్మవార్ల గద్దెల వద్ద అక్షింతలను ఉంచారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు సిద్దబోయిన పాపారావు, జంగా హన్మంతరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా అరికట్టడం బాధ్యత

- భూపాలపల్లి సీడీపీఓ అవంతి

భూపాలపల్లి రూరల్: మహిళల అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యత అని భూపాలపల్లి సీడీపీఓ అవంతి అన్నారు. శనివారం పట్టణంలోని సీడీఎస్ కార్యాలయంలో మనుషుల అక్రమ రవాణాను అరికట్టడంపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ అవంతితో పాటు హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ బలరామకృష్ణ హాజరైయ్యారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిపారు. పేద, మధ్య తరగతి, మారుమూల గ్రామాల యువతులను ఉద్యోగం, సినిమా, డబ్బు అవకాశాలు ఆశచూపి మభ్యపెట్టి తీసుకెళ్లి వ్యభిచార గృహాలకు లేదా విదేశాలకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. దీంతో వారు అక్కడ చాలా దుర్భర స్థితిలో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, తమ పరిధిలో ఉన్న బాలికలకు, మహిళలకు అక్రమ రవాణాపై అవగాహన కల్పించి రక్షించాలని సూచించారు. అక్రమ రవాణాకు గురైనా సందర్భాల్లో 1930 అనే టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ బలరామ కృష్ణ మాట్లాడుతూ.. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ 28 సంవత్సరాలుగా పద్మశ్రీ డా.సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిషు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యా శాఖ, న్యాయ శాఖల సమన్వయంతో రాష్ట్ర వ్యాప్తంగా 28200 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్ శ్రావ్య, అసిస్టెంట్ కోఆర్డినేటర్స్ అంబరీస్ సింగ్, సూపర్‌వైజర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: అవగాహన సదస్సులో అంగన్‌వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్లు

మహదేవపూర్: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మానవ అక్రమ రవాణాపై అంగన్‌వాడీ టీచర్లకు శనివారం అవగాహన కల్పించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మానవ అక్రమ రావణా సంబధిత చిత్రాలను ప్రదర్శించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్, సీడీపీఓ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మహదేవపూర్: అవగాహన కల్పిస్తున్న సురేష్‌కుమార్

పండ్ల మొక్కల విత్తనాలు నాటాలి

మహాముత్తారం: నర్సరీల్లో పలు రకాల మొక్కల విత్తనాలతో పాటు పండ్ల మొక్కల విత్తనాలు కూడా నాటాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని బోర్లగూడెం గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నర్సరీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఈజీఎస్ సిబ్బందికి నర్సరీల్లో పండ్ల మొక్కలు ఎక్కువ శాతం పెంచే విధంగా చూడాలని అదే విధంగా గడువులోగా నర్సరీ పనులు పూర్తిచేయాలన్నారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి శిరిష, ఈజీఎస్ సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వరి నారుకు గడ్డిమందు పిచికారీ

- పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

చిట్యాల: మండలంలోని ఏలేటిరామయ్యపల్లి గ్రామానికి చెందిన ఏలేటి వెంకన్న అనే రైతుకు చెందిన వరి నారుకు అదే గ్రామానికి చెందిన ఏలేటి శ్రీనివాస్ అనే వ్యక్తి గడ్డి మందు పిచికారీ చేయడంతో నారు ఎండిపోయాయని బాధితుడు తెలిపారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో నాలుగున్నర ఎకరాల వరి పొలానికి యాసంగికి నారిమడులు సిద్ధం చేసినట్లు తెలిపారు. తమ సమీప బంధువైన ఏలేటి శ్రీనివాస్ పాత కక్షలను దృష్టిలో ఉంచుకోని నారుకు గడ్డి మందు పిచికారీ చేశాడని పేర్కొన్నారు. కాగా, శ్రీనివాస్ గతంలో కూడా గడ్డి వాములను దగ్ధం చేశాడని అలాగే సైఫోన్ ధ్వంసం చేయడం వలన నీరు మొత్తం మిర్చి కల్లంలోకి పోయి మిర్చి పూర్తిగా తడిసి పోయిందని తెలిపారు. అలాగే ఈ నెల 9న విద్యుత్ వైర్లు కోసి వేశాడని అతని వలన సుమారు రూ.లక్ష 50వేలు నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. ఈమేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.



ఎండిన నారుమడి వద్ద బాధిత రైతు వెంకన్న

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



బైక్ ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, కార్మికులు

భూపాలపల్లి రూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ రాం నర్సింహారెడ్డి సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం రవాణా శాఖ జిల్లా అధికారి ఎండీ సంథాని ఆధ్వర్యంలో స్థానిక జయశంకర్ విగ్రహం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించ పోవడంతో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు చాలామంది మృతి చెందినట్లు తెలిపారు. దీంతో బాధిత కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుందని తెలిపారు. ప్రమాదాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. హెల్మెట్ ధరించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. స్థానిక పోలీసులు, సింగరేణి కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించండి



సామగ్రిని అందజేస్తున్న సీడీపీఓ అవంతి

చిట్యాల: మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల గల పిల్లలను ప్రైవేటు పాఠశాలకు కాకుండా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని సీడీపీఓ అవంతి అన్నారు. శనివారం మండలంలోని కొత్తపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. కలెక్టర్ భవేష్ మిశ్రా అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు 15 రకాల సామగ్రిని అందజేయడం జరిగిందని తెలిపారు. అంగన్‌వాడీ పిల్లలు ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

గొంతెమ్మ గుట్ట సందర్శన

కాటారం: చరిత్రాత్మక విశిష్టత కల్గిన కాటారం మండలంలోని ప్రతాపగిరి సమీపంలో గల గొంతెమ్మ గుట్టను ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పంచాయతీ రాజ్ డీఈఈ సాయిలు, ఏఈఈ అశోక్ శనివారం సందర్శించారు. గొంతెమ్మ గుట్టపై ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవాల జాతర త్వరలో జరగనున్న నేపథ్యంలో ఎంపీపీ, అధికారులు గుట్టపై సౌకర్యాలు కల్పన కోసం పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ప్రభుత్వం ద్వారా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిసింది. అటవీ ప్రాంతం గుండా రోడ్డు మార్గం, గుట్టపై విద్యుత్ సౌకర్యం తదితర ఏర్పాట్లు చేయనున్నట్లు సమాచారం.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఏటూరునాగారం: బాల్య వివాహాలను అరికట్టాలని ఏటూరునాగారం ఐసీడీఎస్ సీడీపీఓ హేమలత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ అరుణ అధ్యక్షతన బాలిక సాధికారత, బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో అమ్మాయిలు, అబ్బాయిలు లింగ బేధం లేకుండా ఇద్దరిని సమానంగా చూడాలన్నారు. బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు తెలిపారు. చదువుకునే దశ నుంచే బాలికలు లక్ష్యాలను ఎంచుకొని ఆ దిశగా ప్రయణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య, స్థానిక బీట్ ఆఫీసర్ రాజేశ్వరి, టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఏటూరునాగారం: మాట్లాడుతున్న హేమలత

మంగపేట: మండలంలోని రాజుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రావుల భాస్కర్‌రావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు నేటి సమాజంలో లింగవివక్షత, బాల్యవివాహాలపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పాఠశాలలో ప్రతి మూడో శనివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో లింగవివక్షత వలన జరిగే పరిణామాలను వివరించారు. లైంగిక వివక్షతల కారణంగా సరైన ప్రోత్సాహం లేక స్త్రీలు కొన్ని కార్యక్రమాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. అన్ని రంగాల్లో స్త్రీలకు అవకాశం కల్పిస్తే తమదైనశైలిలో ముందంజలో దూసుకెళ్తున్నారన్నారు. సమానమైన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. స్త్రీ పురుష బేధం లేకుండా పనిచేస్తూ వేతనాల వద్ద మాత్రం వివక్షతకు గురవుతున్నారన్నారు. ఇలాంటి సమావేశాలు తరచూ నిర్వహిస్తూ రకరకాల రంగాల్లో విజయవంతంగా రాణిస్తున్న స్త్రీల విజయాలను తెలుసుకోవడం ద్వారా ముందడుగు వేయగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో బాల రక్షభారత్ ప్రతినిధి రమేష్, పాఠశాల చైర్మన్ దాసరి రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాలకు రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న పోలం రాజేందర్

కాటారం: గత ప్రభుత్వం ఆదివాసీ గిరిజనులకు ఇచ్చిన పోడు పట్టాలకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సూదుల శంకర్, కార్యదర్శి పోలం రాజేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పోడు రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చినప్పటికీ బ్యాంక్ అధికారులు మాత్రం రుణాలు ఇవ్వడం లేదన్నారు. బ్యాంకు రుణాలు అందక రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలు చెల్లించలేక అప్పుల్లో కూరుకుపోతున్నారని ఆరోపించారు. బ్యాంకుల ద్వారా పోడు రైతులకు పంట రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రుణాలు ఇవ్వకుంటే రైతులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళనలకు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి దయ్యం వినోద్, కాల్వపల్లి కల్పన తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన నాయకులు



మంత్రి సీతక్కతో నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాల్వపల్లికి చెందిన బీసీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ యశాడపు మల్లయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దబోయిన శ్రీనివాస్ హనుమకొండలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను శనివారం కలిసి కాల్వపల్లి గ్రామాల్లోని సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని సమస్య లుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారిస్తానని నాయకులకు హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో రంజిత్, శ్యామల రాజు ఉన్నారు.

సాగు నీటిని అందించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

వెంకటాపురం(కె): పాలెం ప్రాజెక్టు నుంచి గిరిజన రైతులకు సాగు నీరు అందించాలని కోరుతూ ఆదివాసీ నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిరుతపల్లి గ్రామ సమీపంలోని ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై మూడు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నవ నిర్మాణ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు మాట్లాగుతూ.. వంద కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన పాలెం ప్రాజెక్టు నుంచి పంట పొలాలకు రావాల్సిన సాగు నీరు గోదావరి పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కెనాల్ అధికారులు మరమ్మతులు చేయక పోవటం సాగునీరు అందటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పాలెం ప్రాజెక్టు కాల్వకు మరమ్మతులు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న అధికారులు ఆందోళన చేసిన రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. అట్టం సత్యం, ఇర్ప బాబు, మాజీ సర్పంచ్ వెంకటరమణ, వాసం నారాయణ, రమేష శివ ఉన్నారు.

గీతకార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: గీతకార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య కోరారు. శనివారం మండలంలోని కాటాపూర్‌లోని ఎల్లమ్మ గుడి ఆవరణలో ముస్తాదర్ గడ్డం శ్రీధర్ అధ్యక్షతన కల్లుగీత కార్మిక సంఘం నూతన క్యాలెండర్‌ను నర్సయ్య గీతకార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని గౌడ కులస్తులను ఎస్టీ జాబితాలో కలపాలని డిమాండ్ చేశారు. గీతకార్మికులకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. గీత కార్మికుల భద్రత కోసం యంత్రాలను పంపిణీతో పాటు ద్విచక్రవాహనాలను ఉచితంగా అందించాలన్నారు. కంఠమహేశ్వర, మైసమ్మ, ఎల్లమ్మ బోనాల పండుగను మార్చిలో జరుపుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులి పెద్ద నర్సయ్య, జిల్లా నాయకులు బెల్లంకొండ రోశయ్య, పులి రవి, పాలకుర్తి రవీందర్, ప్రదీప్, శంకర్ గీత కార్మికులు బెల్లంకొండ నరేష్, రంగు సత్యం, రాజయ్య, సదయ్య పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గుడుంబా స్థావరాలపై దాడులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామంలో గుడుంబా స్థావరాలపై వెంకటాపురం సీఐ బండారి కుమార్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లం పానకంతో పాటు గుండుంబా తయారు చేసే సామగ్రిని ధ్వంసం చేశారు. గుండుంబా తయారు చేస్తున్న రాము, పుల్లారావు అనే ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ బండారి కుమార్ మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడైన గుడుంబా తయారు చేసిన విక్రయించిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. గుడుంబా విక్రయించిన, తయారు చేస్తున్నట్లు ఎవరికై నా తెలిస్తే తక్షణమే పోలీసులు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు తిరుపతి రావు, అశోక్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.



దాడుల్లో పాల్గొన్న పోలీసులు

జాగృతి ఆధ్వర్యంలో షటిల్ క్రీడోత్సవాలు

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేటలో భారత జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం షటిల్ క్రీడోత్సవాలు నిర్వహించి శనివారం బహుమతులు అందించినట్లు భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పోరిక రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడం వల్ల గ్రామీణస్థాయి క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడుతాయని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. షటిల్ క్రీడల్లో ప్రథమ బహుమతి పొందిన చిర్ర మహేందర్, దర్శన్ జట్టుకు రూ.5016 నగదుతో పాటు షీల్డ్, ద్వితీయ బహుమతి పొందిన వినీల్, రాజేందర్‌లకు రూ.3016 నగదుతో పాటు షీల్డ్‌ను బహుకరించారు. కార్యక్రమంలో నిర్వహకులు తిరుపతి, సిద్ధూ, రాజు, సంతోష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న డాక్టర్ రవీందర్

చిన్నారులకు టీకాలు

మహాముత్తారం: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల వద్ద శనివారం వైద్యసిబ్బంది 5సంవత్సరాల లోపు చిన్నారులకు బీసీజీ, ఓపీవీ, హెచ్ఈపీబీ, ఐపీవీ, జేఈ,ఎంఆర్ పలు టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సందీప్, ఆయా గ్రామాల్లోని ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం: మండలంలో ప్రత్యేక శిబిరం ఓటరు నమోదు కార్యక్రమాన్ని 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఖాజామొహినొద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని 28 ఓటరు నమోదు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపెయిన్‌లను ఆయన పరిశీలించారు. 28 కేంద్రాల్లో ఫాం-6 28 వచ్చాయని, ఫాం-8 రెండు వచ్చాయన్నారు. అలాగే 170 ఎమ్మెల్సీ దరఖాస్తులు రాగా వాటిపై విచారణ జరుగుతుందన్నారు. అలాగే నేడు(ఆదివారం) కూడా ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని ఆయన వెల్లడించారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న హరికృష్ణ

వాజేడు: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని అయ్యవారిపేటలో శనివారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ములుగు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక చట్టాలు, బాలలపై లైంగిక దాడులు, బాలల హక్కులు, దత్తతలపై అవగాహన కల్పించారు. బాల్యం అమూల్యమైన దశ అని దానిని పొందేలా చూడాలన్నారు. పిల్లలను దత్తత తీసుకునే వారు చట్టపరంగా తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో సుమన్, అయ్యవారిపేట గ్రామ రైతులు పాల్గొన్నారు.